సాక్షి
యాదాద్రి భువనగిరి
ఆదివారం । 13 । ఆగస్టు । 2023



ఉరేసి.. ఊపిరి తీసి
బోర్‌వెల్ డ్రిల్లర్ హత్యకు గురైన ఘటన మోత్కూరు మండలం పొడిచేడులో శనివారం వెలుగులోకి వచ్చింది.
- 8లో



ధర్నాను జయప్రదం చేయాలి
ఈనెల 14న సీపీఎం తలపెట్టిన ధర్నాలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు కోరారు.
- 9లో



కాంగ్రెస్ జెండా ఎగురవేస్తాం
వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో భువనగిరిలో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ఎంపీ వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు.
- 10లో

నేతన్నలకు అండ

మాది చేతల ప్రభుత్వం.. చేనేతల ప్రభుత్వం : కేటీఆర్



చేనేత ప్రతిజ్ఞ చేయిస్తున్న చేనేత, జౌళి శాఖ మంత్రి కేటీఆర్, వేదికపై మంత్రి జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, జెడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్యేలు పైళ్ల శేఖర్‌రెడ్డి, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమణ, కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు

- చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- నైపుణ్యం కలిగిన యువత ముందుకురావాలి
- కార్మికులకే హ్యాండ్లూమ్ పార్కు అప్పగిస్తాం
- రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, చేనేత జౌళి శాఖ మంత్రి కేటీఆర్

భూదాన్‌పోచంపల్లి: బీఆర్‌ఎస్ ప్రభుత్వం నేతన్నలకు అండగా ఉంటుందని రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, చేనేత జౌళి శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. చేనేత వృత్తిపై ఆధారపడిన కార్మికులందరికీ త్వరలో గుర్తింపు కార్డులు జారీ చేస్తామని, వచ్చే నెల నుంచి ప్రతి మగ్గానికి నెలకు రూ.3 వేల చొప్పున అందజేస్తామని హామీ ఇచ్చారు. భూదాన్ పోచంపల్లిలో చేనేత యువ కళాకారుడు సాయిని భరత్ టీ–టాప్ ద్వారా నెలకొల్పిన కళా పునర్వి ఇంటిగ్రేటెడ్ హ్యాండ్లూమ్ యూనిట్‌ను శనివారం మంత్రి ప్రారంభించారు. మగ్గాలు, మగ్గాలపై తయారైన వస్త్రాలు, ట్విస్టింగ్ యూనిట్‌ను పరిశీలించారు. యూనిట్‌లో పనిచేస్తున్న చేనేత కార్మికులతో మాట్లాడారు. ఎంత కూలి లభిస్తుందని తెలుసుకున్నారు. త్రిఫ్ట్, నేతన్న బీమా అమలవుతున్నాయా అని ఆరా తీశారు.ఇదే యూనిట్‌లో మగ్గం పని చేస్తున్న కనుముకుల గ్రామానికి చెందిన నిరుపేద దివ్యాంగుడైన చుక్క నరేశ్, చుక్క పావని దంపతుల ఆర్థిక పరిస్థితి తెలుసుకొని వీరికి గృహలక్ష్మి పథకం కింద వెంటనే రూ.3 లక్షల ఆర్థిక సాయం అందజేయాలని అక్కడే ఉన్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డిని ఆదేశించారు. తమది చేతల ప్రభుత్వమని.. చేనేతల ప్రభుత్వమని మంత్రి కేటీఆర్ అన్నారు.

నైపుణ్యం కల్గిన యువత అవసరం

ఎంటెక్ చదివి.. ఉద్యోగం వదులుకొని చేనేత రంగంలోకి రావడానికి కారణమేంటని సాయిని భరత్‌ను మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. జాబ్ చేయడం కాదు.. జాబ్ క్రియేట్ చేయాలని మీరిచ్చిన స్ఫూర్తి, సహకారంతోనే హ్యాండ్లూమ్ యూనిట్‌ను ప్రారంభించామని సాయిని భరత్ మంత్రి కేటీఆర్‌కు బదులిచ్చారు. ప్రాచీన చేనేత వృత్తిని ముందుకు తీసుకెళ్లాలని, సాయిని భరత్ లాంటి నైపుణ్యం కల్గిన యువత ఈ రంగాన్ని ఎంచుకోవడం శుభపరిణామమని కొనియాడారు. పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును రన్ చేయడానికి మీలాంటి యువత ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చేనేత కార్మికులకు ఉపాధి కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, అందులో భాగంగానే ఇటీవల చండీగఢ్ మొహాలీలోని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌ను సందర్శించానన్నారు. వారిని పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును సందర్శించి పార్కును లాభాల బాటలో నడిపిస్తూ, వేలాది మందికి ఉపాధి కల్పించే విధంగా చూడాలని కోరామన్నారు.కళా పునర్వి హ్యాండ్లూమ్ యూనిట్ సక్సెస్‌పై అధ్యయనం చేయాలని చేనేత అధికారులకు సూచించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ధోబీఘాట్ పనులకు మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో కలిసి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. అనంతరం బాలాజీ ఫంక్షన్ హాలు ఆవరణలో ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించి పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కుకు ప్రారంభోత్సవం చేశారు.

చెక్కులు అందజేసిన మంత్రి

సాయిని భరత్ టీ–టాప్ ద్వారా నెలకొల్పిన కళా పునర్వి హ్యాండ్లూమ్ యూనిట్‌కు ప్రభుత్వం నుంచి రూ.51,71,838 చెక్కు, పోచంపల్లి చేనేత కార్మికులకు త్రిఫ్ట్ ఫండ్ పథకం కింద మంజూరైన గ్రాంట్ రూ.62,30,400 చెక్కును అందజేశారు. అదేవిధంగా వేముల బాలనర్సింహ దంపతులకు చేనేత గుర్తింపు కార్డులు అందజేశారు. అనంతరం పోచంపల్లికి చెందిన చేనేత కళాకారుడు భోగ బాలయ్య మగ్గంపై రూపొందించిన జాతీయ పతాకాన్ని, తడక యాదగిరి రాసిన పోచంపల్లి ఇక్కత్ చేనేత పరిశ్రమ పుస్తకాన్ని మంత్రి ఆవిష్కరించారు. ట్రాక్టర్‌పై ప్రదర్శించిన మగ్గం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా బస్వలింగేశ్వరకాలనీ వాసులు తాము ఇళ్లు నిర్మించుకోవడానికి అనుమతి ఇవ్వాలని, వేతనాలను పెంచాలని మున్సిపల్ కార్మికులు మంత్రికి వినతిపత్రాలు అందజేశారు.

హ్యాండ్లూమ్ పార్కు తాళం చెవులు అందజేత

బ్యాంకు తనఖాలో ఉన్న పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును వేలం పాటలో రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. కాగా శనివారం సభావేదికపై చెన్నైకి చెందిన బ్యాంకుల కన్సార్షియమ్ ప్రతినిధులు హ్యాండ్లూమ్ పార్కు తాళం చెవిలను కేటీఆర్‌కు అందజేశారు. అంతకుముందు పోచంపల్లి మున్సిపాలిటీకి నిధులు మంజూరు చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి మంత్రి కేటీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతమహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, శానంపూడి సైదిరెడ్డి, రవీంద్రనాయక్, జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్. రమణ, మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్, అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్‌డీడీ వెంకటేశం, జిల్లా ఏడీ విద్యాసాగర్, ఎంపీపీ మాడ్గుల ప్రభాకర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్, మున్సిపల్ కమిషనర్ నర్సింహారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ బాత్క లింగస్వామి, కౌన్సిలర్లు దారెడ్డి మంజుల వేణురెడ్డి, కొంగరి కృష్ణ, సుర్కంటి జ్యోతిరంగారెడ్డి, పెద్దల చక్రపాణి, కర్నాటి రవీందర్, గుండు మధు, సామల మల్లారెడ్డి, భోగ భానుమతి విష్ణు, కుడికాల అఖిలబలరాం, దేవరాయకుమార్, జల్లి నర్సింహ, నుస్రత్‌షరీఫ్, అజ్జు, రావుల లావణ్యశ్రీను, తహసీల్దార్ వీరాభాయి, ఎంపీడీఓ బాలశంకర్, పీఏసీఎస్ చైర్మన్ కందాడి భూపాల్‌రెడ్డి, టీఆర్‌ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు పాటి సుధాకర్‌రెడ్డి, సీత వెంకటేశం, చిల్వేరు బాలనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా నేతన్న విగ్రహావిష్కరణ



పోచంపల్లిలో ఏర్పాటు చేసిన నేతన్న విగ్రహాన్ని మంత్రి కేటీఆర్ ఆవిష్కరించారు. విగ్రహానికి గజమాల వేశారు. ఈ సందర్భంగా పద్మశాలి మహాజన సంఘం అధ్యక్షుడు సీత శ్రీరాములు, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు తడక రమేశ్, అంకం మురళి కేటీఆర్‌కు శాలువా కప్పి సన్మానించారు.



చేనేత కార్మికుడు భోగ బాలయ్య మగ్గంపై నేసిన జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న కేటీఆర్

హ్యాండ్లూమ్ పార్కును సూపర్‌హిట్ చేయాలి

పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును అద్భుతంగా తీర్చిదిద్దాలని మంత్రి కేటీఆర్ అన్నారు. మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, చేనేత జౌళిశాఖ డైరెక్టర్ అలుగు వర్షిణి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డితో కలిసి కనుముకుల పరిధిలోని పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్కును సందర్శించారు. అక్కడ అడ్మినిస్ట్రేటివ్ భవనం, వీవింగ్ యూనిట్, ట్రైనింగ్ సెంటర్‌ను పరిశీలించారు. వెంటనే పార్కును వినియోగంలోకి తీసుకొచ్చి కార్మికులకు ఉపాధి కల్పించాలని అధికారులను ఆదేశించారు. చేనేత వర్గానికే పార్కును అప్పగిస్తామని, అందరూ సమష్టిగా పనిచేసి సూపర్‌హిట్ చేయాలని అన్నారు. కలెక్టర్, చేనేత నాయకులు మంచి బిజినెస్ చేసేలా ప్లాన్ చేయాలని సూచించారు.



హ్యాండ్లూమ్ పార్కును ప్రారంభిస్తున్న కేటీఆర్, చిత్రంలో జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, నాయకులు



కళాపునర్వి యూనిట్‌లో చేనేత వస్త్రాలను పరిశీలిస్తున్న మంత్రి కేటీఆర్

శేఖర్‌రెడ్డిని మళ్లీ గెలిపించుకోవాలి

- పోచంపల్లి సభలో కేటీఆర్ పిలుపు
- భువనగిరికి ఎన్ని నిధులైనా కేటాయిస్తామని వెల్లడి



ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని గెలిపించాలని సభికులను కోరుతున్న మంత్రి కేటీఆర్

సాక్షి, యాదాద్రి : మంచి పనులు చేసే ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డిని బ్రహ్మాండమైన మెజార్టీతో మళ్లీ గెలిపించుకుందామని రాష్ట్ర ఐటీ, పురపాలక, చేనేత శాఖా మంత్రి కేటీఆర్ ప్రజలను కోరారు. శనివారం భువనగిరి నియోజకవర్గంలోని భూదాన్ పోచంపల్లిలో జరిగిన చేనేత వారోత్సవాల సభలో ఆయన ప్రసంగించారు. నియోజకవర్గం అభివృద్ధి కోసం నిరంతరం తపించిపోయే ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డికి ఎన్ని నిధులు కావాలన్నా కేటాయిస్తానని హామీ ఇచ్చారు. మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలను కోరారు. దీంతో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా శేఖర్‌రెడ్డిని ప్రకటించినట్లైంది. ఇప్పటికే తుంగతుర్తి ఎమ్మెల్యేగా గాదరి కిషోర్‌కుమార్‌కు హ్యాట్రిక్ విజయం కట్టబెట్టాలని కేటీఆర్ అక్కడి ప్రజలను కోరిన విషయం తెలిసిందే. ఉమ్మడి జిల్లాలో బీఆర్‌ఎస్ నుంచి తొలి టికెట్‌ను కిషోర్‌కు ప్రకటించగా.. రెండో టికెట్‌ను శేఖర్‌రెడ్డికి ప్రకటించినట్లైంది. కాగా, భువనగిరిలో కాంగ్రెస్ నుంచి కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి బీఆర్‌ఎస్‌లో చేరడంతో శేఖర్‌రెడ్డి విజయం ఏకపక్షమైందని కేటీఆర్ ప్రకటించడంతో అనిల్‌కుమార్‌రెడ్డికి తగిన ప్రాధాన్యత లభించే అవకాశం ఉందన్న చర్చ మొదలైంది. పార్లమెంట్ ఎన్నికల్లో భువనగిరి నుంచి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరడం ద్వారా.. కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి వచ్చే ఎన్నికలో ఎంపీ స్థానానికి పోటీచేసే అవకాశం కల్పిస్తారని భావిస్తున్నారు.

న్యూస్‌రీల్

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్



వినతులు స్వీకరిస్తున్న విప్ సునీత

ఆలేరు రూరల్ : ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలన్న ఉద్దేశంతో ప్రతి వారం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. శనివారం ఆలేరులోని తన క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో నియోజకవర్గంలోని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకరయ్య, పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేషం, కౌన్సిలర్లు శ్రీకాంత్, నర్సింహులు, మార్కెట్ డైరెక్టర్లు కుండె సంపత్, పత్తి వెంకటేష్, శ్రవణ్, సర్పంచ్ శ్రీశైలం పాల్గొన్నారు.

మర్యాల వెల్‌నెస్ సెంటర్‌లో కేంద్ర బృందం



రికార్డులను పరిశీలిస్తున్న ప్రతినిధులు

బొమ్మలరామారం : మండలంలోని మర్యాల పల్లె దవాఖాణ(వెల్‌నెస్ సెంటర్)ను శనివారం నేషనల్ క్వాలిటీ అస్సెస్‌మెంట్ బృందం సదర్శించింది. ఆస్పత్రి నిర్వహణ, రోగులకు అందుతున్న సేవల గురించి తెలుసుకున్నారు. ఆస్పత్రి పరిసరాల్లో పరిశుభ్రతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో మరింత విశ్వాసం పెంపొందించేలా పని చేయాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ యశోధ, మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్, డాక్టర్ శ్రావణి, సీహెచ్‌ఓ మురళీధర్, రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

మోస్తరు వర్షం

భువనగిరి టౌన్ : జిల్లాలో శనివారం ఉదయం మోస్తరు వర్షం కురిసింది. భువనగిరి పట్టణంలో 27.1 మి.మీ, భువనగిరి మండలంలో 53.5 మి.మీ, గుండాల 37.8 మి.మీ, అడ్డగూడూరు 27.8, మోత్కూర్ 23.0 మి.మీ, ఆత్మకూర్(ఎం) లో 20 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

యాదాద్రీశుడికి రూ.1.20 లక్షల విరాళం



ఈఓకు చెక్కు అందజేస్తున్న హర్షవర్ధన్‌రావు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రానికి వెండి కలశాలల కోసం హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌కు చెందిన హర్షవర్ధన్ రావు శనివారం రూ.1.20లక్షలు విరాళంగా అందజేశారు. ఇందుకు సంబంధించిన చెక్కును ఈఓ గీతారెడ్డికి అందజేశారు.

'గృహలక్ష్మి'కి దరఖాస్తు గడువు పెంచాలి



మాట్లాడుతున్న గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట : గృహలక్ష్మి పథకం దరఖాస్తు గడువు కేవలం మూడు రోజులే ఇవ్వడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు అన్నారు. గడువు తక్కువగా ఉండడంతో చాలా మంది దరఖాస్తు చేసుకోలేకపోయారని పేర్కొన్నారు. యాదగిరిగుట్టలోని మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు పేరబోయిన పెంటయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తు గడువు ఈనెల 30వరకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొల్లూరి రాజయ్య, క్లెం కృష్ణ, మండల కార్యదర్శి జిల్లా జానకిరాములు, మండల సహాయ కార్యదర్శి పేరబోయిన మహేందర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గోరేటి రాములు, మండల కార్యవర్గ సభ్యులు పేరబోయిన బంగారు, గోపగాని రాజు, ముక్కెర్ల పెంటయ్య, గుండు వెంకటేష్ ఉన్నారు.

దారులే 'బార్లు'!

పర్మిట్ రూములున్నా ఆరుబయటే సిట్టింగ్

- అర్ధరాత్రి దాకా మద్యంబాబుల హంగామా
- భయాందోళనలో మహిళలు
- ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి
- చోద్యం చూస్తున్న ఎక్సైజ్, పోలీస్ యంత్రాంగం



భువనగిరి : బస్టాండ్ వద్ద ఉన్న వైన్స్ ఎదుట మందుబాబులు, అక్కడి నుంచి వెళ్తున్న మహిళలు

బీబీనగర్ మండలం భట్టుగూడెం వద్ద గల మద్యం దుకాణం వద్ద నాలుగు రోజుల క్రితం సాయంత్రం ఓ యువకుడు పూటుగా మద్యం సేవించాడు. అదే సమయంలో ఓ విద్యార్థిని చిన్నరావులపల్లి వద్ద బస్సు దిగి నడుచుకుంటూ ఇంటికి వెళ్తుండగా ఆ యువకుడు తాగిన మైకంలో విద్యార్థినిని అటకాయించి వేధించాడు. విద్యార్థిని తన కుటుంబ సభ్యులతో కలిసి షీటీంను సంప్రదించడంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి కౌన్సిలింగ్ ఇచ్చారు. వెలుగులోకి రాని ఇటువంటి సంఘటనలు మరెన్నో ఉన్నాయి.

సాక్షి, యాదాద్రి : మద్యం ప్రియులు రోడ్లు, వీధులను బార్లుగా మార్చేస్తున్నారు. సాయంత్రం మొదలు.. అర్ధరాత్రి వరకు ఫుల్లుగా మద్యం సేవించి స్థానికులకు, దారిన వచ్చిపోయే వారికి చుక్కలు చూపుతున్నారు. మహిళలు సాయంత్రం ఆరు దాటిందంటే ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మందుబాబులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా ఎక్సైజ్, పోలీసులు నోరు మెదపడం లేదు.

పేరుకే పర్మిట్ రూమ్‌లు

జిల్లా వ్యాప్తంగా 82 మద్యం దుకాణాలు ఉన్నాయి. నిబంధనల ప్రకారం దాదాపు అన్ని షాపులకు పర్మిట్ రూమ్‌లు ఉన్నాయి. మద్యం బాబులు ఈ గదుల్లోకి వెళ్లి మద్యం సేవించాలి. కానీ, పరిస్థితులు అందుకు విరుద్ధంగా ఉన్నాయి. దుకాణాల ఎదుటే గుంపులుగా నిలబడి మద్యం సేవించడంతో పాటు అక్కడే మూత్ర విసర్జన చేస్తున్నారు. పూటుగా తాగి ఘర్షణ పడడం, దారిన వచ్చిపోయే వారిని వేధింపులకు గురి చేస్తున్నారు. వీరి ఆగడాల కారణంగా మహిళలు, విద్యార్థినులు మద్యం దుకాణాల ముందుకు రాగానే బిక్కుబిక్కుమంటూ వెళ్తున్నారు.

- చౌటుప్పల్ : లక్కారం, తంగడపల్లి రోడ్డు, హ్యాండ్లూమ్ మార్కెట్‌కు వెళ్లే దారి, పోలీస్‌స్టేషన్ ఎదురుగా భాస్కర్ థియేటర్ దాటాక సర్వీస్ రోడ్ల పక్కన మద్యం దుకాణాలున్నాయి. వీటి ముందు నుంచి చాలా కాలనీలకు చెందిన మహిళలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు.
- ఆత్మకూరు(ఎం) : మండల కేంద్రంలోని తిమ్మాపురం క్రాస్ రోడ్డు వద్ద రెండు మద్యం షాపులు ఉన్నాయి. ఇక్కడ అనుమతి లేని సిట్టింగ్‌లు నడుస్తున్నాయి. సాయంత్రం నుంచి రాత్రి వరకు మందుబాబులు మద్యం సేవించి బస్టాండ్, వీరులచెరువు, పాఠశాల ప్రాంతాల్లో బైక్‌లపై చక్కర్లు కొడుతుంటారు.
- మోత్కూరు : పట్టణంలో నాలుగు మద్యం దుకాణాలు నడుస్తున్నాయి. జ్యోతిరావు పూలే చౌరస్తాలో ఉన్న వైన్స్ వద్ద ఆరెగూడెం రోడ్డు వైపు జూనియర్ కళాశాల ఉంది. మద్యం బాబులు తమ వాహనాలను రోడ్డుపై పార్కింగ్ చేస్తుండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పెట్రోల్ బంక్, పాత చేనేత సహకార సంఘం భవనం వద్ద కూడా వైన్స్‌లు ఉన్నాయి. మద్యం సేవించి ఇక్కడే మూత్ర విసర్జన చేస్తుండడంతో దుర్వాసనతో ఉండలేకపోతున్నామని స్థానికులు వాపోతున్నారు.
- గుండాల : మండల కేంద్రంలోని బస్టాప్‌కు సమీపంలో వైన్స్ ఉండడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. సాయంత్రం సమయంలో మద్యం ప్రియులు రోడ్డు పక్కనే గుంపులుగా నిలబడి ముచ్చటిస్తూ గంటల తరబడి మద్యం సేవిస్తుండడం ప్రయాణికులకు ఇబ్బందులు కలగజేస్తోంది.
- ఆలేరురూరల్ : పట్టణంలో జనావాసాల మధ్య మద్యం దుకాణాలు ఉన్నాయి. వీటితో పాటు పదుల సంఖ్యలో బెల్టు షాపులున్నాయి. ఇవి కూడా అర్ధరాత్రి వరకు నడుస్తున్నాయి.



భువనగిరి : పట్టణంలోని నల్లగొండ మార్గంలో రోడ్డు పక్కన, ప్రధాన చౌరస్తా వద్ద మరికొన్ని చోట్ల మద్యం దుకాణాలున్నాయి. అర్బన్‌కాలనీకి, రైల్వే గేట్ నుంచి వెళ్లే మార్గాల్లో అర్ధరాత్రి వరకు మద్యం బాబులు మద్యం సేవిస్తూ కనిపిస్తుంటారు.

పాత బస్టాండ్ వైన్స్ వద్ద మందుబాబుల సందడి, అక్కడి నుంచి వెళ్తున్న విద్యార్థినులు



వైన్స్ ఎదుట రోడ్డుపై జాతరలా..


భూదాన్‌పోచంపల్లి : పట్టణంలోని ప్రధాన కూడళ్లలోనే వైన్స్‌లు ఉన్నాయి. మద్యం ప్రియులు రోడ్డు పక్కనే నిలబడి మద్యం సేవిస్తుంటారు. ఈ ప్రాంతాల్లో పోలీసుల పర్యవేక్షణ కూడా ఉండదు.

20న సూర్యాపేటకు సీఎం కేసీఆర్ రాక



సాక్షి ప్రతినిధి, నల్లగొండ : ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈనెల 20వ తేదీన సూర్యాపేట జిల్లా పర్యటనకు రానున్నారు. పర్యటనలో భాగంగా నిర్మాణం పూర్తి చేసుకున్న సూర్యాపేట కలెక్టరేట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. జిల్లా పోలీసు (ఎస్పీ) కార్యాలయాన్ని, నూతనంగా నిర్మించిన మెడికల్ కాలేజీ భవనాన్ని, బీఆర్‌ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం పార్టీ ఏర్పాటు చేయనున్న బహిరంగ సభలో సీఎం పాల్గొంటారు.

యాదాద్రిలో ఏకాదశి పూజలు



పుష్పాలంకరణలో శ్రీస్వామి, అమ్మవార్లు

యాదగిరిగుట్ట : ఏకాదశిని పురస్కరించుకొని యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్రంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖమండపంలోని ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వివిధ రకాల పుష్పాలతో అర్చన చేశారు. తులసీ దళాలతో పూజించారు. ఇక ప్రధానాలయంలో స్వయంభూలు, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు విశేష పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, అర్చన, అభిషేకం చేశారు. అనంతరం ఆలయ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, నిత్యకల్యాణం, గజవాహనసేవ, బ్రహ్మోత్సవం, వెండి జోడు సేవలను వైభవంగా నిర్వహించారు. రాత్రి శయనోత్సవం చేసి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.

పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది

- బదిలీలు, పదోన్నతులతోనే పరిష్కారం
- ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా

భువనగిరిటౌన్ : రాష్ట్ర వ్యాప్తంగా ఎంఈఓ, ప్రధానోపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉండడం వల్ల పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడిందని, వెంటనే పదోన్నతులు, బదిలీల ప్రక్రియ చేపట్టాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు నాగిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ఆ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎనిమిదేళ్ల నుంచి పదోన్నతులు, ఐదు సంవత్సరాల నుంచి బదిలీలు లేకపోవడంతో ప్రభుత్వ రంగ విద్యా వ్యవస్థ లోపభూయిష్టంగా మారిందన్నారు. దీంతో పాటు కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దుచేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని కోరారు. అప్‌గ్రేడ్ చేసిన పండిట్, పీఈటీ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని, పీఆర్సీ కమిటీ వేయాలని, జూలై 1నుంచి ఐఆర్ (ఇంటీరియం రిలీఫ్) ఇవ్వాలని, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే జీఓ 317 బాధితులకు న్యాయం చేయాలని, ఐటీ పరిమితి పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర ,జిల్లా ప్రతినిధులు సిల్వేరు మహేష్, ఎస్.భాస్కర్, మెతుకు సైదులు, ఎస్. లక్ష్మీనర్సింహారెడ్డి, సతీశ్, వెంకటాచారి, సత్తయ్య, వెంకట్‌రెడ్డి, మల్లేశం. మిరియాల దామోదర్, మైలారం సత్తయ్య, పరిపూర్ణాచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

సఖి సెంటర్‌కు బాలిక అప్పగింత

భువనగిరి : జిల్లా కేంద్రంలో సంచరిస్తున్న గుర్తు తెలియని బాలికను స్థానికులు గమనించి సఖి సెంటర్‌కు అప్పగించారు. జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి సైదులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మూడు రోజుల క్రితం హైదరాబాద్ నుంచి ఓ మహిళ పదేళ్ల కూతురుతో కలసి బస్టాండ్‌లో భిక్షాటన చేస్తోంది. ఈ నెల 11న రాత్రి సమయంలో తల్లి కుమార్తెను కోపగించడంతో బాలిక పట్టణంలోని ప్రిన్స్ చౌరస్తా వైపు వచ్చింది. చౌరస్తాలో రాత్రి 10 గంటల సమయంలో ఒంటరిగా ఉన్న బాలికను స్థానికులు గమనించి 1098కు సమాచారం ఇచ్చారు. వెంటనే వాహనం ద్వారా బాలికను సఖి సెంటర్‌కు తరలించారు. బాలిక తల్లి తన కుమార్తె కనిపించకపోవడంతో అదే రోజు రాత్రి పట్టణంలో వెతికింది. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ లేకపోవడంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి వెళ్లి వార్డుల్లో వెతికినట్లు రోగులు తెలిపారు. ప్రస్తుతం తల్లి ఆచూకీ తెలిస్తే బాలికను అప్పగించేందుకు చర్యలు తీసుకుంటామని అధికారి తెలిపారు.

ఉరేసి.. ఊపిరి తీసి..

బోర్‌వెల్ డ్రిల్లర్ దారుణ హత్య

- ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు దుండగుల యత్నం
- మోత్కూరు మండలం పాడిచేడులో వెలుగుచూసిన హత్యోదంతం
- హతుడు ఆత్మకూరు(ఎం) మండలం లింగరాజుపల్లి వాసి



పాడిచేడులో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం



రోదిస్తున్న సైదులు భార్యాపిల్లలు

మోత్కూరు : బోర్‌వెల్ డ్రిల్లర్ దారుణ హత్యకు గురయ్యాడు. యాదాద్రి భువగిరి జిల్లా మోత్కూరు మండలం పాడిచేడు గ్రామంలో మూసీ నది ఒడ్డు ఈ ఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆత్మకూరు (ఎం) మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన సల్ల సైదులు (35) బోర్‌వెల్‌పై డ్రిల్లర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నాయి. కొంత కాలంగా సైదులుకు తన భార్యతో గొడవలు జరుగుతున్నాయి. పెద్ద మనుషుల సమక్షంలో వారికి సర్దిచెప్పడంతో దంపతులు కలిసే ఉంటున్నారు. మూడు రోజుల క్రితం సైదులు భార్య, ఇద్దరు కుమారులను తీసుకుని శాలిగౌరారం మండలం గురజాల గ్రామంలోని



సైదులు మృతదేహం

పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో సైదులు శనివారం ఉదయం పాడిచేడు మూసీ నది ఒడ్డున గంగదేవమ్మ గుడి సమీపంలో విగతజీవిగా పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. సైదులు మెడకు తాడుతో ఉరి వేసినట్టు ఆనవాళ్లు ఉండటంతో గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి ఉంటారని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. సైదులును శుక్రవారం రాత్రే హత్య చేసి ఉంటారని, ఇక్కడే హత్య చేశారా లేక ఎక్కడైనా ఘాతుకానికి ఒడిగట్టి మృతదేహాన్ని ఇక్కడ పడేశారా అని పోలీసులు అనుమానిస్తున్నారు. భువనగిరి నుంచి క్లూస్ టీం వచ్చి ఆధారాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. హత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేశామని, రామన్నపేట సీఐ మోతీరాం కేసు విచారిస్తున్నారని ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

భువనగిరి గంజ్ మార్కెట్ యార్డులో చోరీ

- రూ. 15 వేల నగదు అపహరణ

భువనగిరి : గుర్తుతెలియని వ్యక్తులు భువనగిరి గంజ్ మార్కెట్ యార్డులో చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరల ప్రకారం.. భువనగిరి పట్టణంలో గంజ్ మార్కెట్ యార్డులో కార్తికేయ రైస్ ట్రేడర్స్, ప్రొద్దుటూరు రాజేశ్వరీ ఫెర్టిలైజర్ ట్రేడర్స్, వీరాంజనేయులు కిరాణం అండ్ స్టోర్స్, కుకటప్ రైస్ ట్రేడర్స్ దుకాణాల్లో ఈ నెల 11న గుర్తు తెలియని వ్యకులు చోరీకి యత్నించారు. ఇందులో కార్తికేయ రైస్ ట్రేడర్స్ షట్టర్ పైకి లేపి ఉన్నట్లు శనివారం తెల్లవారుజామున స్థానికులు గమనించి యాజమానికి సమాచారం ఇచ్చారు. వెంటనే యాజమాని వచ్చి పరిశీలించగా షాపులో ఉన్న రూ. 15 వేల నగదు అపహరించుకుని పోయినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడు పల్లెర్ల నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న సీఐ సుధీర్‌కృష్ణ తెలిపారు.

ఎలుకల మందు తాగిన మహిళ మృతి

పెన్‌పహాడ్: ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళ మృతిచెందింది. ఎస్ఐ నర్సింగ్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం...సూర్యాపేట మండలం బాషానాయక్ తండాకు చెందిన బండారు లింగమ్మ (45) తన కుమారుడు మహేష్‌తో కలిసి పెన్‌పహాడ్ మండల కేంద్రంలోని ఊరచెరువులో బాతులను మేపుకుంటూ జీవనం సాగిస్తోంది. రూ.లక్ష వెచ్చించి కొనుగోలు చేసిన బాతుల పెంపకంలో నష్టం వాటిల్లడంతో లింగమ్మ మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో కుమారుడు లేని సమయంలో లింగమ్మ ఈ నెల 6న ఎలుకల మందు సేవించి వాంతులు చేసుకుంది. రాత్రి పొద్దుపోయిన తరువాత ఇంటికి వచ్చిన కుమారుడు ఏమైందని అడగగా ఎలుకల మందు తాగినట్లు తెలపడంతో వెంటనే ఆమెను సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించాడు. చికిత్స అనంతరం ఇంటికి వచ్చారు. శుక్రవారం లింగమ్మ అనారోగ్యానికి గురికావడంతో చికిత్స నిమిత్తం ఖమ్మం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తుండగా మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలికి కుమారుడు మహేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో యువ రైతు మృతి

తుర్కపల్లి: విద్యుదాఘాతంలో ఓ రైతు మృతిచెందాడు. ఈ ఘటన తుర్కపల్లి మండలం తిర్మలాపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. తిర్మలాపూర్ గ్రా మానికి చెందిన డొని కెన కరుణాకర్ (35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కరుణాకర్ వ్యవసాయ బావి వద్ద బోరు మోటారు ఇటీవల కాలిపోయింది. మరమ్మతులు చేయించేందుకు శనివారం మోటారులోని పైపులను బయటికి తీస్తున్నాడు. పైకి లాగుతున్న క్రమంలో పైన ఉన్న 11కేవీ విద్యుత్ వైరుకు పైపు తగలడంతో, దానిని



కరుణాకర్ (ఫైల్)

పట్టుకున్న కరుణాకర్ విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య కవిత ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కోదాడరూరల్ : పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతిచెందాడు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ మండల పరిధిలోని మంగళితండాకు చెందిన ధరావత్ భద్రాజీ(45) మద్యానికి బానిసై గురువారం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు తొలుత కోదాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ జంగం శ్రీనివాసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఇళ్ల స్థలాల విషయంలో విలేకరులపై దాడి

వేములపల్లి : మండల కేంద్రం శివారులో విలేకరులకు ఇళ్ల స్థలాల కోసం తహసీల్దార్ కేటాయించిన స్థలాన్ని చదును చేసుకుంటున్న వారిపై కొందరు దాడి చేశారు. ఈ సంఘటన వేములపల్లి శివారులో శనివారం చోటుచేసుకుంది. వేములపల్లి మండల కేంద్రానికి చెందిన విలేకరుల ఇళ్ల కోసం గ్రామ శివారులోని సర్వే నెం.652లోగల 1.20ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని తహసీల్దార్ కేటాయించారు. విలేకరులు కొన్ని రోజులుగా ఆ స్థలాన్ని జేసీబీ సాయంతో చదును చేయిస్తున్నారు. ఈ క్రమంలో మండలానికి చెందిన కొందరు వ్యక్తులు శనివారం అక్కడ పనులు చేస్తున్న విలేకరులపై దాడి చేశారు. దీనిపై విలేకరులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అనంతరం డీఎస్పీ వెంకటగిరిని కలిసి రక్షణ కల్పించి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని విలేకరులు కోరారు. దళిత విలేకరులపై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కోరుతూ మిర్యాలగూడ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో విలేకరులు వేములపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో చేపట్టారు.



దాడికి నిరసనగా వేములపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట రాస్తారోకో నిర్వహిస్తున్న విలేకరులు

గొలుసు దొంగలు దొరికారు

- నలుగురు చైన్ స్నాచర్ల అరెస్టు
- రూ.10.50 లక్షల విలువైన బంగారం, రెండు బైక్‌లు, ఆటో స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రాచకొండ క్రైం డీసీపీ అరవిందబాబు



వివరాలను వెల్లడిస్తున్న రాచకొండ పోలీసు కమిషనరేట్ క్రైం డీసీపీ అరవిందబాబు

ఇబ్రహీంపట్నం: ఒంటరి మహిళలను టార్గెట్ చేసి రంగారెడ్డి, నల్లగొండ జిల్లాల పరిధిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడుతున్న నలుగురితో కూడిన ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. ఏసీపీ కె.శ్రీనివాస్‌రావు, అడిషనల్ క్రైం డీసీపీ శ్రీనివాసుతో కలిసి ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాచకొండ క్రైం డీసీపీ వి.అరవిందబాబు వివరాలు వెల్లడించారు. కర్మన్‌ఘాట్‌కు చెందిన ఆటో డ్రైవర్ మునావత్ రమేష్ (26), నేరేడిగూడెంకు చెందిన పెయింటింగ్ వర్కర్ నేనావత్ దాసు నాయక్ (23), చాంద్రాయణగుట్టకు చెందిన లేబర్ వర్కర్ నేనావత్ రవి(23), నల్లగొండ జిల్లా పెద్ద అడిశర్లపల్లికి చెందిన మునావత్ నరేష్(23) ముఠాగా ఏర్పడ్డారు. వీరిలో ముగ్గురు బంధువులు కాగా రవికి దాసు స్నేహితుడు. సులువుగా డబ్బులు సంపాదించేందుకు చైన్‌స్నాచింగ్‌లను ఎంచుకొన్నారు.

ఒంటరి మహిళలే లక్ష్యంగా..

ఒంటరిగా ఉండే మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకొని వారి మెడలోని బంగారు గొలుసులను లాక్కొని కొంతకాలంగా చోరీలకు పాల్పడుతున్నారు. మాడ్గుల పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు, నల్లగొండ జిల్లా చింతపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో నాలుగు, కనగల్ పీఎస్ పరిధిలో ఒక దోపిడీకి పాల్పడ్డారు. ఇద్దరు బైక్‌పై, లేదా ఆటోలో ఉండి మరో ఇద్దరు బంగారు గొలుసులు అపహరించి పరిగెత్తుకుంటూ వచ్చి ఆయా వాహనాలపై పరారవుతున్నారు. పథకం ప్రకారం మాడ్గుల పీఎస్ పరిధిలోని న్యూ బ్రాహ్మణపల్లి క్రాస్ రోడ్డు వద్ద శనివారం నిందితులను పట్టుకొని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి రూ.10.50లక్షల విలువైన 98 గ్రాముల బంగారం, ఒక ప్యాసింజర్ ఆటో, రెండు బైక్‌లు, రూ.3,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ డీఎస్ చౌహాన్, మహేశ్వరం జోన్ డీసీపీ శ్రీనివాస్ పర్యవేక్షణలో సీసీఎస్ ఎల్బీనగర్ క్రైం అడిషనల్ డీసీపీ ఎం.శ్రీనివాసులు, ఇబ్రహీంపట్నం ఏసీపీ శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు వెంకటేశ్వర్లు, సైదులు, సురేష్‌కుమార్, విజయ్‌కుమార్, సత్యనారాయణ, రవికుమార్, యాదయ్య, మాడ్గుల సీఐ రాజశేఖర్‌తో కూడిన బృందం వ్యూహం ప్రకారం నిందితులను పట్టుకున్నారు. నిందితులను పట్టుకున్న పోలీస్ సిబ్బందిని రాచకొండ కమిషనర్ చౌహాన్ అభినందించారు.

హ్యాండ్‌పర్స్ అప్పగింత

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన ఓ భక్తురాలు పోగొట్టుకున్న హ్యాండ్‌పర్స్‌ను ఎస్పీఎఫ్ కానిస్టేబల్ గుర్తించి అప్పగించాడు. హైదరాబాద్‌కు చెందిన కల్యాణి కుటుంబం శనివారం ఉదయం బ్రేక్ దర్శనానికి వచింది. దర్శనానికి వెళ్తున్న సమయంలో ఉత్తర రాజగోపురం వద్ద హ్యాండ్ పర్స్‌ను వదిలి వెళ్లిపోయారు. గమనించిన ఎస్పీఎఫ్ కానిస్టేబుల్ సోమేష్‌గౌడ్ ప్రచారశాఖ వద్ద మైక్ అనౌన్స్‌మెంట్ చేయించారు. భక్తురాలు కల్యాణి ఉత్తర రాజగోపురం వద్దకు చేరుకున్నారు. వివరాలు తెలుసుకుని ఆమెకు పర్స్‌ను అప్పగించారు. పర్స్‌లో రూ.2,500 నగదు ఉన్నట్లు భక్తురాలు వెల్లడించారు.

సాగర్‌ను సందర్శించిన ఒడిశా హైకోర్టు జడ్జి

నాగార్జునసాగర్ : ఒడిశా హైకోర్టు న్యాయమూర్తి వి.నర్సింగ్ కుటుంబ సభ్యులతో కలిసి శనివారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. వీరికి డిప్యూటీ తహసీల్దార్ శరత్‌చంద్ర, నిడమనూరు కోర్టు నాయాబ్ అంజయ్య, విజయవిహార్ మేనేజర్ ఎల్లస్వామి బొకే అందజేసి స్వాగతం పలికారు. జడ్జి కుటుంబ సభ్యులు బుద్ధవనంలోని బుద్ధుని పాదాల చెంత పుష్పగుచ్ఛాలు ఉంచి ప్రార్థనలు చేశారు. అనంతరం జాతక పార్కు, స్థూపపార్కు, తపోవనం తదితర ప్రాంతాలను సందర్శించారు. మహాస్థూపంలోని రెండవ అంతస్తులోగల అష్ట బుద్ధుల విగ్రహాలను సందర్శించారు. వారి వెంట ఎస్ఐ సంపత్‌గౌడ్, టూరిజం గైడ్ సత్యనారాయణ, కాలిక్ తదితరులు ఉన్నారు.



బుద్ధుడి పాదాల చెంత పుష్పగుచ్ఛాలు ఉంచుతున్న జడ్జి కుటుంబ సభ్యులు

పీడీఎస్ బియ్యం పట్టివేత

మునుగోడు: మండలం పరిధిలోని రత్తిపల్లి గ్రామం నుంచి శనివారం ఆటోలో 5 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

హరితహారంపై నిర్లక్ష్యం వహించొద్దు

- నల్లగొండ కలెక్టర్ ఆర్.వి. కర్ణన్

నల్లగొండ : తెలంగాణకు హరితహారం కార్యక్రమంపై నిర్లక్ష్యం వహించొద్దని నల్లగొండ కలెక్టర్ ఆర్.వి.కర్ణన్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌తో కలిసి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలు, ఈజీఎస్ సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలంగాణకు హరితహారం, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు, డెంగీ నివారణ చర్యలు, స్వతంత్ర భారత వజ్రోత్సవాల సందర్భంగా ఒక రోజు మొక్కలు నాటే కార్యక్రమంపై సమీక్షించారు. మండలాల వారీగా హరితహారం లక్ష్యం, సాధించిన ప్రగతి సమీక్ష చేస్తూ లక్ష్య సాధనలో వెనుకబడిన నేరెడుగొమ్ము, నార్కట్‌పల్లి, అనుముల, నకిరేకల్, పెద్దవూర, త్రిపురారం, నల్లగొండ ఎంపీడీఓ, ఎంపీలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని జెడ్పీ సీఈఓ, డీఆర్‌డీఓను ఆదేశించారు. స్వతంత్ర భారత వజ్రోత్సవాలు సందర్భంగా నిర్దేశించిన తేదీలో రాష్ట్రంలో ఒక రోజు కోటి మొక్కలు నాటడంలో భాగంగా జిల్లాలో నిర్ణయించిన 8 లక్షల 50 వేల మొక్కలు నాటేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో 16 చోట్ల సంపద వనాలకు గుర్తించిన స్థలాల్లో మొక్కలు నాటాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ తెలంగాణకు హరితహారం కార్యక్రమంలో జిల్లాకు 65 లక్షల51 వేల మొక్కలు లక్ష్యం కాగా ఇప్పటి వరకు 61 శాతం మొక్కలు నాటినట్లు తెలిపారు. కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డీఆర్‌డీఓ కాళిందిని, డీపీఓ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్, అధికారులు

కాలిబాటలతో సాగు ఖర్చులు ఆదా

- నడిగూడెం ఏఓ రాజగోపాలరావు



నడిగూడెం : ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో బావులు, బోర్లు, చెరువుల కింద వరి నాట్ల పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా వరి సాగులో కాలిబాటలు తీయిస్తే పెట్టుబడులు తగ్గడంతో పాటు, దిగుబడులు కూడా పెరుగుతాయని నడిగూడెం మండల వ్యవసాయాధికారి రాజగోపాలరావు చెబుతున్న సలహాలు, సూచనలు ఆయన మాటల్లోనే.. సాగులో సస్యరక్షణ చర్యలు పాటిస్తే సత్ఫలితాలు సాధించవచ్చు. ఆశించిన దిగుబడులూ పొందవచ్చు. వరి సాగులో కాలిబాటలతో ఎన్నో ప్రయోజనాలు ఉంటాయి. పైరుపై చీడపీడల సమస్య తగ్గుతుంది.పెట్టుబడి తగ్గి దిగుబడి పెరుగుతుంది. చాలా మంది రైతులు కాలిబాటలు తీయడానికి ఆలోచిస్తుంటారు. దీనిని అనవసర వ్యయంగా భావిస్తుంటారు. ఎకరం భూమిలో కాలిబాటలు తీయడానికి దాదాపు రూ.600 ఖర్చు అవుతుంది. దిగుబడి సుమారు నాలుగు బస్తాల వరకు పెరుగుతుంది.

పాటించాల్సిన విధానం

కాలిబాటలు తీసుకునే సమయంలో రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. పొడవైన ప్లాస్టిక్ తాడును గట్టుకు ఒకవైపు నుంచి రెండో వైపునకు సాగదీసి కట్టాలి. తాడు వెంబడి 12 సెం.మీ. వెడల్పున వరి నాట్లు తొలగించి పక్కనే పలుచగా ఉన్నచోట నాటుకోవాలి. చేనుగట్టు పక్క నుంచి అడుగు దూరంలో కాలిబాట వేసి అక్కడి నుంచి ప్రతి రెండు మీటర్ల దూరంలో ఒక కాలిబాట తీయాలి. కొందరు రైతులు ప్రతి 6 నుంచి 7 మీటర్లకు ఒక కాలిబాట తీస్తుంటారు. దీని వల్ల ప్రయోజనం ఉండదు. ముందు నాట్లు వేసిన తర్వాత రైతులు గట్లకు ఇరువైపులా తాడు కట్టి మార్క్ చేసిన చోట ఉన్న మొక్కలను తీసివేసి కాలిబాట తీస్తుంటారు. వెదజల్లే పద్ధతిలో పైరు ఎదుగుతున్న సమయంలో 15 నుంచి 20 రోజుల వ్యవధిలో 20 సెం.మీ. వెడల్పులో వరి నాట్లు తొలగించి కాలిబాట వేసుకోవచ్చు.



నడిగూడెం మండలం రామాపురం వద్ద కాలిబాటలు తీసిన పొలం

ఇవీ ప్రయోజనాలు

కాలిబాటతో పైరు మొదళ్ల వరకూ వెలుతురు, గాలి, ఎండ సమృద్ధిగా తగులుతుంది. దీంతో పైరు ఆరోగ్యవంతంగా ఎదుగుతుంది. చీడపీడల బెడద కొంతవరకూ తగ్గుతుంది. కాలిబాట మార్గంలోకెళ్లి కలుపు మొక్కలు తొలగించడానికి, మందులు చల్లుకోవడానికి వీలవుతుంది. తెగుళ్ల గుర్తించి సస్యరక్షణ చర్యలు తీసుకోవడానికి, ఎలుకల నివారణకు ఉపయోగపడుతుంది. తుపానులు, భారీ వర్షాలు వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పుడు పంట చేల్లో మొక్కల్లో కిరణజన్య సంయోగక్రియ సమర్థవంతంగా జరిగి దిగుబడి పెరుగుతుంది. పైరులో చీడపీడల ఉధృతిని అతి సమీపం నుంచి గమనించి, దానికి అనుగుణంగా సకాలంలో సస్యరక్షణ తీసుకునే వీలు కలుగుతుంది.

సూపర్ లగ్జరీ బస్సుల్లో వాటర్ బాటిల్

మిర్యాలగూడ టౌన్ : ఆర్టీసీ నల్లగొండ రీజియన్ పరిధిలోని దేవరకొండ, మిర్యాలగూడ, యాదగిరిగుట్ట, కోదాడ డిపోల నుంచి వివిధ ప్రాంతాలకు 46 సూపర్ లగ్జరీ బస్సులను ఆర్టీసీ అధికారులు నడిపిస్తున్నారు. కాగా ఆర్టీసీ సంస్థ ఎండీ సజ్జనార్ సూచనల మేరకు ఆ బస్సుల్లో టికెట్‌పై రూ.10 అదనంగా పెంచి ప్రతి ప్రయాణికుడికి అర లీటర్ మంచినీటి బాటిల్ అందించే పద్ధతిని ప్రవేశపెట్టారు. ఇప్పటి వరకు ఏసీ బస్సుల్లోనే ఈ సౌకర్యం ఏర్పాటు చేసిన సంస్థ మరో అడుగు ముందుకు వేసి మంచినీటి బాటిళ్లను అందజేస్తుంది. అయితే నల్లగొండ రీజియన్ నుంచి దేవరకొండ నుంచి తిరుపతి మూడు బస్సులు, మిర్యాలగూడ నుంచి తిరుపతి, కాకినాడ, హైదరాబాద్ 32 బస్సులు, యాదగిరిగుట్ట నుంచి తిరుపతికి రెండు బస్సులు, కోదాడ నుంచి తిరుపతి, హైదరాబాద్, విజయవాడకు 9 బస్సులు నడిపిస్తున్నారు.

మొబైల్ షాపులో చోరీ

చండూరు: మున్సిపాలిటీ పరిధిలోని ఓ మొబైల్ దుకాణంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చండూరు పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల యశస్వి మొబైల్ దుకాణంలో శుక్రవారం రాత్రి షెట్టర్ తాళాలు పగులగొట్టి రూ.4వేల నగదు, రూ.40వేల విలువైన నాలుగు సెల్‌ఫోన్‌లు అపహరించారు. శనివారం దుకాణం తెరిచేందుకు వచ్చిన దుకాణ యజమాని చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు.

యువతి అదృశ్యం

సూర్యాపేట క్రైం : హాస్టల్ నుంచి ఇంటికి వెళ్లిన యువతి అదృశ్యమైంది. ఈ ఘటన సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. సీఐ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం...సూర్యాపేటలోని జనగాం క్రాస్ రోడ్డు వద్ద జగతి పబ్లిక్ డిజైబిల్ డిగ్రీ కళాశాలలో మణుగూరుకు చెందిన మూగ యువతి సాయి ప్రియ (24) డిగ్రీ చదువుతుంది. శనివారం ఇంటికి వెళ్లేందుకు హైటెక్ బస్టాండ్ నుంచి మణుగూరుకు బయల్దేరింది. అనంతరం ఆమె ఎంతకూ తిరిగి ఇంటికి చేరలేదు. దీంతో బంధువుల, స్నేహితుల వద్ద ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. శనివారం సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో హాస్టల్ వార్డెన్ షేక్ రంజిన్ ఫిర్యాదు చేశారు.

టాటా ఏస్ వాహనం బోల్తా

బీబీనగర్ : మండలంలోని ఇస్రాయిపల్లికుంట వద్ద రహదారిపై ఓ టాటా ఏస్ వాహనం బోల్తా పడిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టాటా ఏస్ వాహనం బీబీనగర్ నుంచి ఇస్రాయిపల్లి కుంట వైపు వెళ్తుండగా ఉప్పల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బీబీనగర్‌కు వస్తుండగా ఇస్రాయిపల్లి కుంట మూలమలుపు వద్దకు రాగానే ఒక్కసారిగా ఎదురుపడడంతో బస్సును తప్పించే క్రమంలో టాటా ఏస్ ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో ఎవరికి గాయాలు కాకపోడంతో ఊపిరి పీల్చుకున్నారు.